క్లుప్తంగా

నేడు త్రిదండి చిన జీయర్ స్వామి రాక

ప్రత్తిపాడు: స్థానిక నరేంద్రగిరిపై నిర్మిస్తున్న ఆంధ్రా భద్రాద్రి శ్రీరామనామ క్షేత్రానికి గురువారం శ్రీత్రిదండి చినజీయర్ స్వామి రానున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. ఆంధ్రా భద్రాద్రిలో గురువారం జరిగే శ్రీరామ పాదుకా పట్టాభిషేకంలో ఆయన పాల్గొంటారన్నారు. శ్రీరామ పాదుకా పట్టాభిషేకంలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆ ఆరోపణల్లో వాస్తవం లేదు

రౌతులపూడి: మండలంలోని ఎ.మల్లవరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్టు వచ్చిన ఆరోపణల్లో వాస్తవం లేదని కళాశాల ఎస్ఎంసీ చైర్మన్ మానుకొండ రాణి, ప్రిన్సిపాల్ జీ.విజయ్ తెలిపారు. ఈ మేరకు కళాశాల ఆవరణలో బుధవారం పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో మత్తుపదార్థాలు, గంజాయి వంటి అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని అనడానికి ఎలాంటి ఆధారాలు లేవన్నారు. ఆధారాలున్నట్లు రుజువైతే దానికి బాధ్యత వహించి ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ పదవికి రాజీనామ చేస్తానని విజయ్ తెలిపారు. ఉన్నతాధికారులు తీసుకునే చర్యలకు బాధ్యత వహిస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాగమణికి కందుకూరి పురస్కారం



కందుకూరి వీరేశలింగం పురస్కారం అందుకుంటున్న నాగమణి

గోకవరం: మండలంలోని కొత్తపల్లి ఆదర్శ ఫార్మసీ కళాశాల సెక్రటరీ ప్రగళ్లపాటి నాగమణి కందుకూరి వీరేశలింగం పురస్కారం అందుకున్నారు. నల్లమిల్లి రామకోటేశ్వరరావు చారిటబుల్ ట్రస్టు, ది యంగ్‌మెన్స్ వైశ్య అసోసియేషన్ సంయుక్తంగా రాజమహేంద్రవరంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో బీజేపీ నాయకుడు సోము వీర్రాజు, టీడీపీ నాయకుడు గన్ని కృష్ణ చేతుల మీదుగా ఆమె పురస్కారం అందుకున్నారు. పురస్కారం పొందిన నాగమణికి ఆర్యవైశ్య సంఘం నాయకులు, కళాశాల అధ్యాపకులు, పలువురు ప్రజా ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

వరి కోతలు వాయిదా వేసుకోవాలి



గోకవరంలో ధాన్యం రాశులను పరిశీలించి రైతులకు సూచనలిస్తున్న అధికారులు

గోకవరం: తుపాను హెచ్చరికల నేపథ్యంలో రైతులు వరి కోతలను వాయిదా వేసుకోవాలని తూర్పుగోదావరి జిల్లా ఇన్‌చార్జి వ్యవసాయశాఖ అధికారి జయరామలక్ష్మి, పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి రాధిక సూచించారు. గోకవరం మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం వారు పర్యటించారు. కళ్లాల్లో ధాన్యం రాశులను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ధాన్యం రాశులపై బరకాలు కప్పి ఉంచుకోవాలన్నారు. రబీలో వరి, మొక్కజొన్న సాగు చేసే రైతులు ఇన్సూరెన్సు ప్రీమియం కట్టుకోవాలన్నారు. రబీ పంట నమోదును త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో కోరుకొండ ఏడీఏ కృష్ణ, ఏఓ రాజరాజేశ్వరి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న కార్మికుల ఆందోళనలు



చిన్నింపేటలో కార్మికులకు సంఘీభావం తెలుపుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

ఏలేశ్వరం: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండలంలోని చిన్నింపేట జీడిపిక్కల ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న ఆందోళనలు బుధవారం కొనసాగాయి. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మాదేపల్లి సత్యానందరావు దీక్షా శిబిరం వద్దకు చేరుకుని కార్మికులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యాక్టరీ మూసి వేతతో 409 మంది కార్మికులు రోడ్డున పడ్డారన్నారు. యాజమాన్యం తమ న్యాయమైన డిమాండ్లను నేరవేర్చాలన్నారు. ప్రభుత్వం మూసివేసిన ఫ్యాక్టరీని వెంటనే తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నేతలు ధరణాలకోట శ్రీను, కొప్పన కోటేశ్వరరావు, మొయ్యేటి ప్రకాష్, కార్మికులు వీరబాబు, చక్రధర్, గోవిందు, ధర్మాజీ, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కూర కుధరడం లేదు

- కూరగాయల ధరలకు రెక్కలు
- వర్షాలకు తగ్గిన దిగుబడులు
- ఏది కొనాలన్నా కేజీ రూ.40పై మాటే
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న పేద, మధ్యతరగతి ప్రజలు



తుని రైతు బజారులో కూరగాయల దుకాణం

తుని: కార్తిక మాసం ముగిసినా కూరగాయల ధరలు తగ్గలేదు. మార్కెట్లో కాయగూరల ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. బజారుకు వస్తే జేబు ఖాళీ అవుతుంది తప్పా సంచి నిండడం లేదు. ఉల్లి నుంచి మిర్చి వరకు అన్ని కూరగాయల ధరలు సామాన్యులకు అందుబాటులో లేవు. దీనికి తోడు ఇతర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురవడంతో పంటలకు నష్టం వాటిల్లింది. దీంతో డిమాండ్ మేరకు దిగుబడులు రావడం లేదు. గతంలో ఎన్నడూ లేని విధంగా ధరలు పెరిగాయని కొనుగోలుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఉద్యోగులు, సామాన్యుల నెలవారీ బడ్జెట్ పెరిగింది. గతంలో నెలకు కూరగాయలకు రూ. 1000 ఖర్చుచేస్తే ప్రస్తుతం రూ.2000లకు చేరింది. తుని రైతు బజారుకు వచ్చి ఏది కొనుగోలు చేయాలన్నా చుక్కలు కనిపిస్తున్నాయని ప్రజలు అంటున్నారు.

ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి

కోటనందూరు, తుని, రౌతులపూడి మండలాల పరిధిలోని గ్రామాల్లో కూరగాయల దిగుబడులు తగ్గాయి. జూన్‌లో వేసిన పంటలు వర్షాలకు ఆశించిన స్థాయిలో చేతికిరాలేదు. ఇతర ప్రాంతాల్లోనూ వర్షాలు అధికంగా ఉండడంతో దిగుమతులు నిలిచిపోయాయని వ్యాపారులు చెబుతున్నారు. ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవడంతో ధరలు పెరిగాయని వ్యాపారులు అంటున్నారు. హోల్‌సేల్ మార్కెట్‌లో ఎక్కువ ధరకు కొంటున్నామని, రిటైల్‌లో అమ్మకం చేస్తే పెట్టుబడి రావడం కష్టంగా ఉందని చెబుతున్నారు. రోజుకు రూ.20 వేలు అమ్మకం జరిగే దుకాణం ఇప్పుడు రూ.15 వేలకు పరిమితం అయ్యింది. గత నెలలో కూరగాయలు కిలో రూ.50 ఉంటే రూ.90లకు చేరిందని వ్యాపారులు చెబుతున్నారు.

కూరగాయల ధరలు (కిలోకు రూ.లలో)

రకం	పాత ధర	ప్రస్తుత ధర	పెరిగింది
టమాటా	30	40	10
క్యాప్సికం	50	90	40
బీరకాయ	30	60	30
బెండకాయ	30	50	20
వంకాయలు	30	60	30
బీన్స్	30	60	30
మిర్చి	25	40	15
బంగాళా దుంప	30	40	10
చిక్కుడు	50	80	30
ఆకాకర	70	100	30
ఉల్లిపాయలు	40	60	20
బీన్స్ పిక్కలు	50	120	70
అనభకాయ	20	30	10

ధరలు భారీగా పెరిగాయి

మార్కెట్‌కు వెళితే పర్సు ఖాళీ అవుతోంది. సంచి నిండా అన్నిరకాల కూరలు కొనుగోలు చేస్తే రూ.500 ఖర్చువుతోంది. గతంలో నెలకు రూ.1000 అయితే ఇప్పుడు రూ.2000లకు చేరింది. కార్తిక మాసం ముగిసినా ధర తగ్గలేదు.

– బి.గణేష్, తుని

అమ్మకాలు తగ్గాయి

మార్కెట్‌లో కూరలకు ఉన్న డిమాండ్ మేరకు దిగుబడి లేకపోవడంతో ధరలకు రెక్కలు వచ్చాయి. అమ్మకాలు బాగా తగ్గాయి. ఉల్లి నుంచి చిక్కుళ్ల వరకు వందశాతం మేర ధరలు పెరిగాయి. రోజువారీ అమ్మకం రూ.10 వేలు దాటలేదు. ధరలు తగ్గితే వ్యాపారం బాగుంటుంది.

– సుధాకర్, వ్యాపారి, తుని

ఉపాధి వేతనదారులకు గిట్టుబాటు కూలి



డి.పోలవరంలో ఉపాధి నిధులతో నిర్మించిన పశువుల షెడ్డును పరిశీలిస్తున్న ఏపీడీ జగదాంబ

తుని రూరల్: రోజు కూలి గిట్టుబాటయ్యే విధంగా ఉపాధి పనులు చేయించాలని ఎన్ఆర్ఈజీఎస్ కత్తిపూడి అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ పి.జగదాంబ సిబ్బందికి సూచించారు. డి.పోలవరంలో రైతు అలు రామకృష్ణ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.2.30 లక్షలతో నిర్మించిన ఆరు పశువుల షెడ్లు, సీసీ రోడ్లను బుధవారం ఆమె పరిశీలించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో ఏపీఓ, జేఈ, టీఏలు, ఎఫ్ఏలతో ఆమె సమావేశం నిర్వహించారు. కూలీల సంఖ్య పెంచాలని, కూలీలకు రోజు కూలీ రూ.300లకు తగ్గకుండ వేతనం అందేవిధంగా పని చేయించాలని సూచించారు. సోక్ పిట్లు వేగంగా నిర్మించాలని, గృహ నిర్మాణంలో మిగిలిఉన్న పని దినాలను పూర్తి చేయాలని ఆదేశించారు. ఏపీఓ పసుపులేటి నారాయణరావు, జేఈ ఆంజనేయులు, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంపై నిరసనకు కదలిరండి



జగ్గంపేట పార్టీ కార్యాలయంలో కరపత్రాన్ని విడుదల చేస్తున్న వైఎస్సార్ సీపీ యువనేత తోట రాంజీ

జగ్గంపేట: జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద అన్నదాతకు అండగా వైఎస్సార్ సీపీ పేరుతో ఈ నెల 13న చేపట్టే నిరసన కార్యక్రమానికి పార్టీ శ్రేణులు అందరూ కదలిరావాలని ఆ పార్టీ జగ్గంపేట నియోజకవర్గ యువనేత తోట రాంజీ పిలుపునిచ్చారు. జగ్గంపేటలోని పార్టీ కార్యాలయం వద్ద అన్నదాతకు అండగా వైఎస్సార్ సీపీ, దగా చేస్తున్న కూటమి సర్కార్‌పై నిరసన గళం కరపత్రాన్ని ఆయన బుధవారం విడదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని విమర్శించారు. రైతులకు పెట్టుబడి సాయం, ధాన్యానికి కనీస మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం వైఫల్యాలకు నిరసనగా ఈ నెల 13న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద చేపట్టే నిరశన కార్యక్రమంలో రైతులు, పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు రావుల గణేష్‌రాజా, పార్టీ గ్రామ అధ్యక్షులు కాపారపు ప్రసాద్, పార్టీ నేతలు రామకుర్తి జగాల్, వరుపుల సూరిబాబు, భూమాడ గణపతి తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలి

- మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ తుని నియోజకవర్గ కో ఆర్డినేటర్ దాడిశెట్టి రాజా
- తునిలో సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులకు సంఘీభావం



తునిలో సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులకు సంఘీభావం తెలుపుతున్న దాడిశెట్టి రాజా, యనమల కృష్ణుడు

తుని: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ తుని నియోజకవర్గ కో ఆర్డినేటర్ దాడిశెట్టి రాజా డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట దీక్ష చేస్తున్న శ్రీదుర్గా భవానీ మున్సిపల్ కాంట్రాక్ట్ వర్కర్స్ వెల్ఫేర్ సొసైటీ కార్మికులకు బుధవారం మాజీ మంత్రి దాడిశెట్టి రాజా, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత యనమల కృష్ణుడు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ మున్సిపాలిటీ టెక్నికల్ విభాగంలో పని చేస్తున్న కార్మికులకు ప్రభుత్వం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, 15 ఏళ్ల సర్వీసు పూర్తి చేసిన కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వం ఇస్తున్న వేతనాలతో కుటుంబాన్ని పోషించుకునే అవకాశం లేదన్నారు. మున్సిపల్ కార్మికులకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని వైఎస్సార్ సీపీ నేత యనమల కృష్ణుడు అన్నారు. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి, గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కార్మికులకు జీత భత్యాలను పెంచడంతో పాటు రెగ్యులర్ కార్మికుల మాదిరిగా ట్రెజరీ నుంచి జీతాలు చెల్లించిన విషయాన్ని గుర్తు చేశారు. మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని జిల్లా యూనియన్ కార్యదర్శి శివశంకర్ హెచ్చరించారు. వైఎస్సార్ సీపీ తుని నియోజకర్గ యువజన విభాగం అధ్యక్షుడు ఏలూరి బాలు, పార్టీ పట్టణ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ అల్లాడ దివాణం, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అధికారులకు కిశోరి వికాసంపై శిక్షణ



శిక్షణలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి

శంఖవరం: మెరుగైన సమాజం కిశోరి వికాసంతోనే సాధ్యమని ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి అన్నారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో బుధవారం శంఖవరం, రౌతులపూడి మండలాలకు చెందిన వెలుగు, విద్య, వైద్య, రెవెన్యూ శాఖ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీసులు, అంగన్‌వాడీ కార్యకర్తలకు కిశోరి వికాసంపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ సమాజంలో లింగ వివక్షత లేకుండా చూడాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. లైంగిక వేధింపుల నుంచి బాలికలను రక్షించాలన్నారు. బాల్య వివాహలను అరికట్టాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యుడు శెట్టిబత్తుల రాజీవ్, వెలుగు ఏపీఎం వెంకట్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అరుణాశ్రీ తదితరులు పాల్గొన్నారు.

అటవీ భూములకు పట్టాలు ఇప్పించాలి



పి.అగ్రహారం రెవెన్యూ సదస్సులో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

రౌతులపూడి: ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న అటవీ భూములకు పట్టాలు ఇప్పించాలని గిరిజనలు అధికారులను కోరారు. భూ సమస్యల పరిష్కారం కోసం మండలంలోని రాఘవపట్నం, సత్యవరం గ్రామాల్లో బుధవారం డీటీ నరేష్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. రెండు గ్రామాల్లోని వివిధ సమస్యలపై 40 మంది రైతులు దరఖాస్తులు సమర్పించారు. వీటిలో 33 దరఖాస్తులు అటవీ భూములకు పట్టాలిప్పించాలని, వివిధ సమస్యలపై మరో ఏడు దరఖాస్తులు అందాయని అధికారులు వెల్లడించారు. ఆయా సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ రాజశేఖర్, వీఆర్ఓ చందుబాబు, విలేజ్ సర్వేయర్ శివ పాల్గొన్నారు.

పి.అగ్రహారం రైతులకు న్యాయం చేయాలి

తొండంగి: మండలంలోని పి.అగ్రహారం ఉత్తరాది మఠం భూముల వ్యవహారంలో తమకు న్యాయం చేయాలని రైతులు కోరారు. పి.అగ్రహారంలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో రైతులు తహసీల్దార్ మురార్జీని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఉత్తరాది మఠం భూములను దీర్ఘకాలం నుంచి తాము సాగు చేసుకుంటున్నామని, తమకు పట్టాలు మంజూరు చేసి న్యాయం చేయాలని కోరారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని తహసీల్దార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

గిరిబాబును కలసిన వైఎస్సార్ సీపీ నాయకులు



కిర్లంపూడిలో ముద్రగడ పద్మనాభం, గిరిబాబును కలసిన అభిమానులు

కిర్లంపూడి: కిర్లంపూడిలోని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభం నివాసానికి ప్రత్తిపాడు నియోజకవర్గం లంపకలోవ గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు బుధవారం అధిక సంఖ్యలో తరలివచ్చారు. ముద్రగడను, యువ నాయకుడు గిరిబాబును మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ముద్రగడ పద్మనాభం నాయకత్వంలో ప్రత్తిపాడు నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ మరింత బలపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిలిగంపల ప్రభాకర్, చక్కపల్లి బాబ్జీ, లింగంపల్లి సత్యనారాయణ, పి.రాజా, సిగిరెడ్డి చంటిబాబు, తోర్ల చరణ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

పేకాడుతున్న ఏడుగురి అరెస్టు

రౌతులపూడి: మండలంలోని రాజవరం శివారు దిబ్బపాలెం సమీపంలో పేకాట శిబిరంపై బుధవారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో పేకాడుతున్న ఏడుగురిని అరెస్టు చేసినట్టు రౌతులపూడి ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు. వారి నుంచి రూ.7200 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలిస్తామని తెలిపారు. ఈ దాడిలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నీటి సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్

తుని రూరల్: మండలంలో సాగునీటి సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ చేసినట్టు తహసీల్దార్ ప్రసాద్ బుధవారం తెలిపారు. 14 సంఘాలకు ఎన్నికలు జరగాల్సి ఉండగా అందులో 12 మైనర్ నీటి వినియోగదారుల సంఘాలు, రెండు మేజర్ కాలువల డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఉన్నాయన్నారు. మొత్తం 91 టెరిటోరియల్ నియోజకవర్గాలు ఉండగా అందులో పురుషులు 4717 మంది, స్త్రీలు 2274 మంది ఓటర్లు ఉన్నారు. వీరంతా ఈ నెల 14న జరిగే నీటి సంఘాల ఎన్నికల్లో తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు.

ప్రత్తిపాడు: మండలంలోని 17 సాగునీటి సంఘాలకు ఈ నెల 14న ఎన్నికలు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ ఎం.సూర్యప్రభ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. మండలంలోని మేజర్ ఇరిగేషన్ కింద మూడు పుష్కర ఆయకట్టు సంఘాలు, సుబ్బారెడ్డి సాగర్ ప్రాజెక్టు కింద ఆరు మధ్య తరహా సాగునీటి సంఘాలు, ఎనిమిది చిన్న తరహా సాగు నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. ఈ సంఘాల్లో మొత్తం 138 మంది సభ్యులను ఎన్నుకుంటారని చెప్పారు.

ఎన్నికల సిబ్బంది నియామకం

మండలంలోని 17 సాగు నీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు 17 మంది ఎన్నికల అధికారులు, 17 మంది అసిస్టెంట్ ఎన్నికల అధికారులు, 44 మంది పోలింగ్ ఆఫీసర్లు, 44 మంది అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్లను నియమించినట్టు తహసీల్దార్ ఎం సూర్యప్రభ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో గీతా జయంతి



గోకవరం గీతామందిరంలో భగవద్గీత పఠనం చేస్తున్న మహిళా భక్తులు



ఏలేశ్వరంలో భగవద్గీత శ్లోకాలు పఠనం చేస్తున్న మహిళలు



ప్రత్తిపాడు నరేంద్రగిరిపై గీతా పారాయణ చేస్తున్న భక్తులు

- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- ఘనంగా గీతా, విష్ణు సహస్రనామ పారాయణలు

గోకవరం: స్థానిక గీతామందిరంలో గీతా జయంతిని బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సూర్యపీఠం ట్రస్టు ఆధ్వర్యంలో ఉదయం గీతామందిరం వద్ద సుదర్శన హోమం, శ్రీకృష్ణునికి శ్రీరాభిషేకం నిర్వహించారు. భగవద్గీత పఠనం, విష్ణు సహస్రనామ పారాయణ చేశారు. ఈ సందర్భంగా సూర్యపీఠం ట్రస్టు అధ్యక్షుడు తోట సాయిబాబు మాట్లాడుతూ మానవుడు తరించడానికి ఉన్న ఏకైక గ్రంథం భగవద్గీత అని, ప్రతిఒక్కరూ నిత్యం భగవద్గీతను పఠించాలన్నారు. కార్యక్రమంలో తటవర్తి సత్యవతి, గంటా రఘుపతి, గండి వాణి తదితరులు పాల్గొన్నారు.

ఏలేశ్వరంలో...

ఏలేశ్వరం: పట్టణంలో బుధవారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో గీతా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ కార్యదర్శి కటకం కిరిటీ, దుర్గావాహిని, మాతృశక్తి మహిళా సంఘాల ఆధ్వర్యంలో పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ డీవీవీ సత్యనారాయణ ఇంటి వద్ద వేడుకలు నిర్వహించారు. వేడుకల్లో భాగంగా భగవద్గీతలోని 700 శ్లోకాలు పఠనం చేశారు. అనంతరం ప్రసాదం వితరణ చేశారు. విశ్వ హిందూ పరిషత్ కార్యదర్శి కటకం కిరిటీని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మహిళా సభ్యులు పి.దేవి, కె.ఇందిరా, మంగమణి, రమాదేవి, కామాక్షి, కుమారి, సుగుణ, రేవతి, ఉమా తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: స్థానిక నరేంద్రగిరిపై ఆంధ్రా భద్రాద్రి క్షేత్రంలో గీతా జయంతి సందర్భంగా బుధవారం శ్రీరామభక్త బృందం ఆధ్వర్యంలో గీతా పారాయణం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



మర్రిపాకలో అంగన్‌వాడీ కేంద్రంలో క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న చిన్నారులు



జగ్గంపేట క్రిస్మస్ వేడుకల్లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

జగ్గంపేట: అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్ని మతాలకు సంబంధించిన పండగలు నిర్వహించడంతో పాటు పండగల ప్రాధాన్యతపై పిల్లలకు అవగాహన కలిస్తున్నట్టు ఐసీడీఎస్ పీడీ ప్రవీణ తెలిపారు. మండలంలోని మర్రిపాక అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో సంక్రాంతి, దసరా, క్రిస్మస్ తదితర పండగలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో జగ్గంపేట ఐసీడీఎస్ సీడీపీఓ పూర్ణిమ, సూపర్‌వైజర్ అమ్మాజీ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

క్రైస్తవ సోదరులకు శుభం జరగాలి

జగ్గంపేట: క్రిస్మస్ సందర్భంగా క్రైస్తవ సోదరులకు అంతా శుభం జరగాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నేత జ్యోతుల చంటిబాబు అన్నారు. జగ్గంపేటలో వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ జోనల్ ఇన్‌చార్జి జాన్‌వెస్లీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన క్రిస్మస్ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు బందారు రాజా, కంచి లక్ష్మణదొర, బుదిరెడ్డి చక్రరావు, వుయ్యూరి నాని తదితరులు పాల్గొన్నారు.